యాదగిరిగుట్ట నిర్మాణం అద్భుతం

కేసీఆర్ ఆరోగ్యం ఎలా ఉంది? అడిగానని చెప్పండి

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రశంసించారు. ఆగమనశాస్త్రం ప్రకారం కట్టారంటూ అభినందించారు. గవర్నర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శనివారం రాజ్‌భవన్‌లో కలిసిన సందర్భంగా వారి మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి బీఆర్ఎస్ ప్రతినిధి బృందాన్ని గవర్నర్ ఆరా తీసినట్టు తెలిసింది. 'కేసీఆర్ ఎలా ఉన్నారు? ఆయన ఆరోగ్యం ఎలా ఉన్నది? అడిగానని చెప్పండి' అని అన్నట్టు సమాచారం. తాను కూడా యాదగిరిగుట్టను సందర్శించానని, అద్భుతంగా ఉన్నదంటూ గవర్నర్ కొనియాడారని బీఆర్ఎస్ ప్రతినిధులు తెలిపారు. 'కంగ్రాచ్యులేట్ హిమ్' అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారని తెలిసింది. కాంగ్రెస్ హామీలు, ప్రొటోకాల్ ఉల్లంఘనలు, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరు తదితర అంశాలపై తాము చేసిన ఫిర్యాదుల విషయంలో గవర్నర్ స్పందన బాగున్నదంటూ బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సంతృప్తి వ్యక్తంచేసింది. అధికారులను పిలిచి మాట్లాడుతామని హామీ ఇచ్చారని తెలిపారు.

నేడే ఏడో విడత గ్రీన్ ఇండియా చాలెంజ్

ప్రారంభించనున్న ఒడిశా అసెంబ్లీ స్పీకర్

ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని సంతోష్‌కుమార్ పిలుపు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): దేశాన్ని హరితమయంగా మార్చే గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాలుపంచుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం భువనేశ్వర్‌లోని ఐఆర్‌సీ గ్రామంలో ఉన్న ప్రభుత్వ హైస్కూళ్లలో ఒడిశా అసెంబ్లీ స్పీకర్ సురమా పాధి చేతలు మీదుగా గ్రీన్ ఇండియా చాలెంజ్ ఏడో విడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'హర హైతో భారా హై– గ్రీన్ ఇండియా చాలెంజ్' (భూమి పచ్చగా ఉంటే లోకం నిండుగా ఉంటుంది) కార్యక్రమంలో పాల్గొనాలని ప్రజలను కోరారు. భూమి ని చల్లగా ఉంచేందుకు, జీవజాతులను కాపాడేందుకు అందరం మొక్కలు నాటుదామని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి గ్రీన్ హీరోగా మారాలని కోరారు.

అగ్నిమాపకశాఖలో భారీగా బదిలీలు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా అగ్నిమాపక శాఖలో శనివారం భారీగా బదిలీలు జరిగాయి. 18 మంది డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లు (డీఎఫ్‌వో), 22 మంది అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ ఆ శాఖ డీజీ వై నాగిరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా కమిటీ ప్రొసీడింగ్స్ ప్రకారం మల్టీజోన్ల పరిధిలో జిల్లా ఫైర్ ఆఫీసర్ స్థాయి నుంచి సాధారణ ఉద్యోగి, కానిస్టేబుళ్ల వరకూ ఈ బదిలీలు జరిగాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం డీఎఫ్‌వోలు, ఏడీఎఫ్‌వోలు, ఇతర ఉద్యోగులు వెంటనే విధుల్లో చేరాలని డీజీ ఆదేశించారు. మూడు రోజుల్లోపు రిపోర్టు చేయడంలో ఆలస్యమైతే వారు రిలీవ్ అయినట్టుగా పరిగణిస్తామని హెచ్చరించారు.

జూకంటి జగన్నాథంకు దాశరథి అవార్డు

మొదటిపేజీ తరువాయి...

జారీచేశారు. అవార్డుతోపాటు రూ.1,01,116 నగదు, జ్ఞాపికను ఆయనకు అందజేయనున్నారు. ఈ సందర్భంగా జగన్నాథంకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

మూడున్నర దశాబ్దాల ప్రస్థానం

కవిగా, రచయితగా జూకంటి జగన్నాథం ప్రస్థానం దాదాపు మూడున్నర దశాబ్దాలు. ఆయన స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రం. ఆయన 1993లో మొదటి కవితా సంకలనం పాతాళ గరిగెను విడుదల చేశారు. తర్వాత సుమారు 16 కవితా సంకలనాలు వెలువరించారు. ఆయన కవితలు కన్నడ, తమిళం, హిందీ, ఇంగ్లిష్‌లోకి అనువాదం అయ్యాయి. 2005లో జూకంటి కథలు, 2020లో జూకంటి జగన్నాథం కథలు పేరుతో కథా సంకలనాలు వెలువరించారు. ఆయనను పలు అవార్డులు రివార్డులు వరించాయి. 1998లో మొదటిసారి సినారె కవితా పురస్కారం అందుకున్నారు. ఆయన 2014 నుంచి ఆలిండియా తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

రాష్ట్రంలో రాజ్యాంగ హననం

మొదటిపేజీ తరువాయి...

గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జగదీశ్‌రెడ్డి, తలసాని, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, వివేకానంద, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, పాడి కౌశిక్‌రెడ్డి, కోవ లక్ష్మి, నవీన్‌కుమార్‌రెడ్డి,

మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాజ్యాంగంపై జరుగుతున్న దాడి, ఇతర అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని, రాష్ట్రపతికి కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరినట్టు వెల్లడించారు. నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడం, ప్రతిపక్ష నియోజకవర్గాల్లో ఎక్కడా ప్రొటోకాల్ పాటించకపోవడం వంటి అంశాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. నిరుద్యోగ యువత, విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలను ఎలా తుంగలో తొక్కుతున్నారో గవర్నర్‌కు వివరించామని చెప్పారు. హామీలు అమలుచేయాలని కోరుతున్న విద్యార్థుల మీద నిర్బంధం, అణచివేత, అరెస్ట్‌లు, అక్రమ కేసులతో భయానక వాతావరణం పునరావృతం చేస్తున్నారని మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ అంటూ ప్రచారం చేశారని, వాటిని అమలు చేయడంలేదని దుయ్యబట్టారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో లాఠీచార్జి, ఉస్మానియా యూనివర్సిటీ హస్టల్‌లో ఉన్న విద్యార్థులపై దాడి చేస్తూ ఉద్యమకాలం నాటి అణచివేత వైఖరిని కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ప్రయోగిస్తున్నదని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. గ్రూప్–1,2,3 పోస్టులను పెంచుతామంటూ ఇచ్చిన హామీని పట్టించుకోకపోవడం, మెగా డీఎస్సీ, రూ.4 వేల నిరుద్యోగ భృతి తదితర హామీలను అమలుచేయని విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఆయా అంశాలపై గవర్నర్ చాలా సీరియస్‌గా స్పందించారని, హోంశాఖ కార్యదర్శిని పిలిచి వివరాలు అడుగుతానని హామీ ఇచ్చారని వెల్లడించారు. విద్యార్థుల మీద ఈవిధంగా జరగడం మంచిది కాదని గవర్నర్ అన్నారని కేటీఆర్ చెప్పారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని తుంగలో తొక్కుతూ కాంగ్రెస్ పార్టీ పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, ఎనిమిది మంది ఎమ్మెల్సీలను చేర్చుకున్న విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను భయపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని ఆరోపించారు. దీనిపై న్యాయపోరాటం చేస్తున్నామని, స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేశామని వివరించారు. బీఆర్ఎస్ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీగా పోటీచేసిన విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. నిరుద్యోగుల విషయంలో గవర్నర్ చాలా సీరియస్‌గా స్పందించిన తీరును అభినందిస్తున్నామని, స్వాగతిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు బీఆర్ఎస్ పార్టీగా అండగా ఉంటుందని, వారికి కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చేవరకు పోరాటం చేస్తామని స్పష్టంచేశారు

త్వరలో మేడిగడ్డకు...

మేడిగడ్డ కొట్టుకుపోయిందని, కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు గంగపాలు అయ్యిందంటూ చిల్లర ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సిగ్గుతో తలదించుకోవాలని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అక్కడ జరిగిన చిన్న విషయంపై తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. కొన్నిరోజుల్లోనే రిపేర్లు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇప్పుడు గోదావరికి వరద వస్తున్నా మేడిగడ్డ తట్టుకున్నదంటే అదే కాళేశ్వరం ప్రాజెక్ట్ గొప్పతనమేనని చెప్పారు. త్వరలోనే మేడిగడ్డను సందర్శిస్తామని, ప్రజలకు వాస్తవాలు వివరిస్తామని చెప్పారు. పరీక్షలు వాయిదా వేస్తే కోచింగ్ సెంటర్లకు రూ.వందల కోట్లు లాభం వస్తుందని సీఎం అన్నారని, ఇప్పుడు నాలుగు నెలలు వాయిదా వేశారని, రూ.నాలుగు వందల కోట్లు వస్తున్నాయా? అందులో సీఎం వాటా ఎంత? అని ప్రశ్నించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు టీ హరీశ్‌రావు, మహమూద్‌అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, జీ జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సీహెచ్ మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, కేపీ వివేకానంద, మాగంటి గోపినాథ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, కోవ లక్ష్మి, పాడి కౌశిక్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, అనిల్‌జాదవ్, చింతా ప్రభాకర్, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు ఎస్ మధుసూదనాచారి, ఎల్ రమణ, నవీన్‌కుమార్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, శంభీపూర్ రాజు, దేశపతి శ్రీనివాస్, వాణీదేవి, పొచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన

ప్రొటోకాల్ ఉల్లంఘనలను కూడా గవర్నర్‌కు వివరించామని కేటీఆర్ వెల్లడించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అగౌరవపర్చడం, అధికారుల తీరు, ప్రజాప్రతినిధుల హక్కులకు భంగం వాటిల్లుతున్న తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దీనిపై కూడా ప్రభుత్వాన్ని వివరణ కోరుతూ లేఖ రాస్తానని గవర్నర్ హామీ ఇచ్చారని చెప్పారు. భవిష్యత్తులో విపక్షాలుగా ఎలాంటి ఇబ్బంది వచ్చినా కలవాలని గవర్నర్ సూచించారని తెలిపారు. తన పరిధిలో ఉన్న అంశాల్లో తప్పకుండా న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. ఒకవైపు రాజ్యాంగాన్ని రక్షిస్తున్నట్టు రాహుల్‌గాంధీ పోజులు కొడుతూ.. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.

సీడీపీవో పరీక్ష రద్దుపై అభ్యర్థుల నిరసన

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖలో శిశు అభివృద్ధి ప్రాజెక్టు గ్రేడ్–1 అధికారుల (సీడీపీవో) రాత పరీక్షను రద్దు చేయడంపై అభ్యర్థుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. సీడీపీవో పరీక్షల రద్దు విషయంలో టీజీపీఎస్సీ అత్యుత్సాహం చూపిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు ఉద్యోగ పరీక్షల ప్రశ్న పత్రాలు లీకైన సంగతి తెలిసిందే. వీటిపై సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (సీఎఫ్ఎస్ఎల్), ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తునకు ఆదేశించారు. అయితే ఓవైపు దర్యాప్తు జరుగుతుండగానే సీడీపీవో పోస్టుల కోసం 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపికచేసి, వారికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ ఫలితాలను ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేశారు. ఈ పోస్టుల భర్తీ కోసం ఇప్పటికే అభ్యర్థుల తుది జాబితా కూడా మహిళాఅభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు అందింది. ఇప్పుడు పరీక్షను రద్దు చేస్తున్నట్టు ప్రకటించడం అభ్యర్థులను తీవ్ర నిరాశ నిస్పృహలకు గురిచేసింది. అధికారులు ఇంతకాలం తమకు ఆశలు కల్పించి, ఇప్పుడు నీళ్లు చల్లారని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

హైకోర్టు చెప్పినా పట్టించుకోని టీజీపీఎస్సీ

సీడీపీవో పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు మూడు వారాలలోపు నియామక పత్రాలు ఇవ్వాలని హైకోర్టు గతంలోనే టీజీపీఎస్సీకి ఆదేశాలు జారీ చేసిందని అభ్యర్థులు తెలిపారు. కోర్టు ఆదేశాలను అధికారులు బేఖాతరు చేశారంటూ మరోవైపు కోర్టు ధిక్కరణ కేసు దాఖలైంది. దీనిపై సోమవారం టీజీపీఎస్సీ వాదనలు వినిపించాల్సి ఉన్నది. ఇంతలోనే పరీక్షను రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని అభ్యర్థులు మండిపడుతున్నారు. ఫలితాలు విడుదల చేసిన దాదాపు ఐదున్నర నెలల తర్వాత సీడీపీవో పరీక్షలు విడుదల చేయడం వల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆగని నర్సుల నిరసన.. ఆగిన కౌన్సెలింగ్!

- సీనియర్ నర్సుల బదిలీపై తేలని పంచాయితీ
- డీపీహెచ్ కార్యాలయాన్ని ముట్టడించిన నర్సులు
- సీనియార్టీ, వేకెన్సీ జాబితా పారదర్శకంగా ఇవ్వాలి
- పదోన్నతులు, ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ కోసం పట్టు
- చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ల రిటెయినింగ్‌పై కొత్త దుమారం



హైదరాబాద్ కోఠిలోని డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహిస్తున్న నర్సులు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ)/సుల్తాన్ బజార్: డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) విభాగంలో నర్సింగ్ ఆఫీసర్ల బదిలీల రచ్చ శనివారం కూడా కొనసాగింది. కోఠిలో శుక్రవారం అర్ధరాత్రి వరకు నిరసన తెలిపిన నర్సులు.. శనివారం డీపీహెచ్ కార్యాలయాన్ని ముట్టడించారు. పారదర్శకంగా సీనియార్టీ జాబితా ప్రకటించాలని, వేకెన్సీ జాబితాను ప్రదర్శించి, ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించాలని, ఆప్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.లక్షలు తీసుకొని, సీనియార్టీ జాబితా నుంచి పేర్లను మాయం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా హెడ్ నర్సుల పదోన్నతులు చేపట్టాలని, ఆ తర్వాతే బదిలీలు మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు కొందరు నర్సింగ్ ప్రతినిధులను కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణణ్ వద్దకు తీసుకెళ్లారు. పదోన్నతులు చేపట్టడం కుదరదని, బదిలీలను ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామని, సీనియార్టీ లిస్ట్‌ను మరోసారి సమీక్షించి, సాయంత్రానికి వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు మధ్యాహ్నం మూడు గంటల వరకు వేచిఉన్నా డీపీహెచ్ డాక్టర్ రవీంద్రనాయక్ తన కార్యాలయానికి రాకపోవడంతో స్టాఫ్ నర్సులు కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీకి చేరుకొని.. ఓఎంసీ అకడమిక్ బ్లాక్ వద్ద నిరసన తెలిపారు. దీంతో డీపీహెచ్ అక్కడికి చేరుకున్నారు. ఉదయం నుంచి తాము ఆయన కోసం ఎదురుచూస్తే 'త్వరలో కమ్యూనికేట్ చేస్తాం' అంటూ ఒక్క ముక్క మాట్లాడి వెళ్లిపోయారని నర్సులు మండిపడ్డారు. దీంతో సీనియర్, జూనియర్ నర్సింగ్ ఆఫీసర్ల బదిలీ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో మళ్లీ కౌన్సెలింగ్ ఎప్పుడు నిర్వహిస్తారో తెలపాలని తెలంగాణ (ప్రభుత్వ) నర్సెస్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం డీపీహెచ్‌కు వినతిపత్రం అందించారు. జోన్ల వారీగా సీనియార్టీ లిస్టును, లాంగ్ స్టాండింగ్ జాబితాను, 40 శాతం తప్పనిసరి బదిలీల జాబితాను విడుదల చేయాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మరియమ్మ కోరారు. సీనియర్లకు పదోన్నతులు కల్పించాలని అన్నారు. ఏ క్యాటగిరీలో ఎవరెవరిని బదిలీ చేస్తున్నారో జాబితాలో స్పష్టంగా పేర్కొనాలని డిమాండ్ చేశారు.

హెడ్ నర్సుల జాబితాలోనూ తప్పుల తడక

డీపీహెచ్ పరిధిలో హెడ్ నర్సుల కౌన్సెలింగ్ శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి జరుగాల్సి ఉండగా.. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైంది. ఇందులోనూ సీనియార్టీ లిస్టు తప్పుల తడకగా ఉన్నదంటూ హెడ్ నర్సులు మండిపడ్డారు. శుక్రవారం నాటి ఘటనల నేపథ్యంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ ముందు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్ నేతృత్వంలో సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి, నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు, సుల్తాన్ బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్ఐలు కిరణ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్, శ్వేత బందోబస్తులో పాల్గొన్నారు.

'ఆమె'కు రిటెయినింగ్‌పై రగడ

చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ల బదిలీలో శనివారం కొత్త రగడ మొదలైంది. యూనియన్ల పేరుతో దశాబ్దాలుగా హైదరాబాద్‌లో పాతుకుపోయిన ఓ నర్సింగ్ ఆఫీసర్‌ను రిటెయిన్ చేయడంపై ఇతర సిబ్బంది మండిపడుతున్నారు. ఆమెకు సంబంధం లేని ఉద్యోగ సంఘం నుంచి ఆఫీస్ బేరర్ లెటర్ తీసుకొచ్చిందని ఆరోపిస్తున్నారు.

ఇతర విభాగాల్లోనూ 'అక్రమ' బదిలీలు

నర్సింగ్ ఆఫీసర్ల బదిలీలు రచ్చకెక్కడంతో డీపీహెచ్ పరిధిలోని డిప్యూటీ డైరెక్టర్(అడ్మిన్), ఫార్మసీ, ల్యాబ్, ఏఎన్ఎమ్, ఎమ్‌పీహెచ్‌డబ్ల్యూ (మేల్, ఫీమేల్) తదితర క్యాడర్ల కౌన్సిలింగ్ కూడా సక్రమంగా జరగలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీనియార్టీ జాబితా తప్పుల తడకగా ఉన్నదని, అర్హత లేకున్నా స్పాజ్, ఇతర కారణాలతో చాలా మందిని రిటెయిన్ చేశారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇందుకు డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్) బదిలీలను ఉదాహరణగా చూపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13 మంది ఉండగా, హైదరాబాద్‌లోనే 11 మంది పనిచేస్తున్నారు. వీరిలో ఐదుగురు లాంగ్ స్టాండింగ్ అధికారులు ఉండగా.. నలుగురిని స్పాజ్ కోటా కింద రిటెయిన్ చేశారు. అయితే ఇందులో ఇద్దరికి మాత్రమే అర్హత ఉన్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఆరోగ్యశాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేరినట్టు సమాచారం. పలువురు యూనియన్ల నేతలు మధ్యవర్తుల అవతారం ఎత్తి రూ.లక్షలు వసూలు చేసి, కీలక అధికారులకు ముట్టజెప్పారని, అందుకే ఇలా అక్రమ బదిలీలు జరిగాయని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై వైద్యారోగ్య శాఖ మంత్రి స్పందించి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

11వ వేజ్‌బోర్డు ద్వారా పెన్షన్ చెల్లించాలి

సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్

హైదరాబాద్, జూలై 20(నమస్తే తెలంగాణ): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు 11వ వేజ్‌బోర్డు ప్రకారం పెన్షన్లు, ఇతర బకాయిలు చెల్లించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు విజ్ఞప్తిచేశారు. దీనిపై గుర్తింపు సంఘం నాయకులు వెంటనే సింగరేణి చైర్మన్ బలరాంతో చర్చించి సత్వరమే అమలయ్యేలా చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. సింగరేణి ఉద్యోగులకు 11వ వేజ్ బోర్డు ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారని కానీ, పెన్షనర్లకు మాత్రం ఇంకా 10వ వేజ్‌బోర్డు ప్రకారమే పెన్షన్లు చెల్లిస్తున్నట్టు వాపోయారు. దీనివల్ల పెన్షనర్లకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ పెన్షన్, పాత వేజ్‌బోర్డు ప్రకారం పెన్షన్ చెల్లించడంతో తాము సమస్యలు ఎదుర్కొంటున్నట్టు వివరించారు.

జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి 4 నెలల్లోగా ఎన్నికలు

సహకార శాఖకు కోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని జర్నలిస్టు కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌కు 4 నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర సహకార శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సొసైటీ ఎన్నికలను నిర్వహించడం లేదంటూ బీ గోపరాజు తదితరులు వేసిన పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఇటీవల విచారణ జరిపారు. ప్రస్తుత కమిటీ సభ్యుల జోక్యం లేకుండా, ముగ్గురు సభ్యుల కమిటీ నివేదికతో ప్రమేయం లేకుండా తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సహకార సంఘ అధికారిని ఆదేశించారు.

రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్‌రాజ్

- జీఏడీ కార్యదర్శిగా మహేశ్‌దత్ ఎక్కా నియామకం
- పలువురు ఐఏఎస్‌లకు బదిలీలు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): కేంద్ర సర్వీసుల నుంచి తిరిగి వచ్చిన సీనియర్ ఐఏఎస్ అధికారి వికాస్‌రాజ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయనకు రవాణా, హౌసింగ్, జీఏడీ (కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం, స్మార్ట్ గవర్నెన్స్)బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ముగ్గురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలలుగా వెయిటింగ్‌లో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి మహేశ్‌దత్ ఎక్కాకు జీఏడీ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడేనాటికి ఎంసీఆర్‌హెచ్చార్డీ డీజీగా ఉన్న ఆయనను ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో భూగర్భ, గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేసింది. అనంతరం మేలో జరిపిన బదిలీల్లో జీఏడీకి అటాచ్ చేసింది. హన్మకొండ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తాను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా నియమించింది. వీరితోపాటు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ శరత్‌కు ఆ శాఖ కమిషనర్‌గా, స్పోర్ట్స్ డైరెక్టర్‌గా ఉన్న కొర్ర లక్ష్మికి గిడ్డంగుల కార్పొరేషన్ ఎండీగా, ఆర్‌అండ్ బీ శాఖ సంయుక్త కార్యదర్శిగా ఉన్న ఎస్ హరీశ్‌కు విపత్తుల నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

రెచ్చిపోయిన ఇసుకాసురులు

ఇసుక మాఫియా దాడిలో గాయపడిన కర్నె మహేందర్

- అర్ధరాత్రి వేళ అక్రమంగా తరలింపు
- అడ్డుకున్న బీఆర్ఎస్ నేత తల పగులగొట్టిన మాఫియా
- భీమ్‌గల్ మండలం బెజ్జోరాలో ఘటన

భీమ్‌గల్, జూలై 20: ఇసుకాసురులు రెచ్చిపోయారు. అర్ధరాత్రి వేళ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులపై దాడికి దిగారు. తమనే ఆపుతారా? అంటూ రాళ్లు, కర్రలతో తల పగులగొట్టారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం బెజ్జోరాలో శుక్రవారం అర్ధరాత్రి ఈ దారుణం చోటుచేసుకున్నది. బెజ్జోరా శివారులోని కప్పలవాగు నుంచి కొన్నాళ్లుగా అర్ధరాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అధికార పార్టీ కనుసన్నల్లో ఈ తతంగం సాగుతున్నది. దీనిపై గతంలోనే కలెక్టర్, సీపీకి ఫిర్యాదు చేసినా పెద్దగా స్పందన లేదు. శుక్రవారం అర్ధరాత్రి ముచ్కూర్ నుంచి భీమ్‌గల్ వైపు వస్తున్న బీఆర్ఎస్ యూత్ నేతలు కర్నె మహేందర్, అనిల్, నరేశ్‌కు ఇసుక ట్రాక